


టీమ్ ఫైబర్ బ్రాండ్‌ను యాక్ట్ ఫైబర్‌నెట్‌గా మారుస్తున్నట్లు ప్రకటిస్తున్న యాక్ట్ సీఈఓ బాలా మల్లాది (మధ్యలో వ్యక్తి). చిత్రంలో ఇండియా వేల్యూ ఫండ్‌కు చెందిన ప్రమోద్ కాబ్రా, యాట్రియా డైరెక్టర్ సుందర్ రాజు

# మరిన్ని నగరాలకు 'యాక్ట్' అంతర్జాల సేవలు

## రూ.1,000 కోట్ల పెట్టుబడుల ప్రణాళిక

## హైదరాబాద్‌లో బీమ్ ఫైబర్ బ్రాండ్ పేరు మార్పు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లో ఇప్పటి వరకూ బీమ్‌ఫైబర్ పేరుతో వైర్డ్ బ్రాడ్‌బ్యాండ్ ద్వారా అంతర్జాల సేవలందిస్తున్న యాట్రియా కన్వర్జెన్స్ టెక్నాలజీస్ (యాక్ట్) దేశ వ్యాప్తంగా కార్యకలాపాలను విస్తరించనుంది. ఇందుకు భారీగా పెట్టుబడులు పెట్టనుంది. వైర్డ్ బ్రాడ్‌బ్యాండ్ అంతర్జాల సేవలందిస్తున్న కంపెనీల్లో నాలుగో అతిపెద్ద కంపెనీ అయిన యాక్ట్ ప్రస్తుతం హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలలోను, ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో కొన్ని ప్రాంతాల్లోను అంతర్జాల, కేబుల్ సేవలను అందిస్తోంది. నూరు శాతం అనుబంధ సంస్థయిన బీమ్ టెలికామ్‌ను 2009లో యాక్ట్ సొంతం చేసుకుంది. 2-3 నెలల్లో విశాఖలో అంతర్జాల సేవలు ప్రారంభించనున్నామని, ఏడాదికి ఒక పెద్ద నగరం చొప్పున పది పెద్ద నగరాలకు వైర్డ్ అంతర్జాల సేవలను విస్తరించనున్నామని యాక్ట్ సీఈఓ. బాలా మల్లాది తెలిపారు. ఒక్కో నగరంలో నెట్ సేవలందించడానికి ఆప్టికల్ ఫైబర్ కేబుళ్ల వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, ఇందుకు ఒక్కో నగరానికి రూ.100 కోట్ల పెట్టుబడి పెట్టాల్సి ఉంటుందని చెప్పారు. ఇప్పటికే రూ.1,000 కోట్ల పెట్టుబడులు పెట్టిన కంపెనీ కనీసం 10 నగరాలకు సేవలను విస్తరించడానికి మరో రూ.1,000 కోట్ల పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది.

**బ్రాండ్ మార్పు:** సమగ్ర దేశీయ బ్రాండ్‌గా గుర్తింపు పొందడానికి బీమ్ ఫైబర్ (హైదరాబాద్‌లో) బ్రాండ్‌ను యాక్ట్ ఫైబర్‌నెట్ బ్రాండ్‌గా మార్చింది. దేశంలోనే తొలిసారిగా సాధారణ వినియోగదారులకు 100 ఎంబీపీఎస్ వేగంతో అంతర్జాల సేవలను ప్రవేశపెట్టింది. డౌన్‌లోడ్ పరిమితి 200 జీబీ. దీనికి నెలవారీ చందా రూ.2,079. కంపెనీకి ఆరున్నర లక్షల అంతర్జాల చందాదారులు ఉన్నారు. ఏడాదిన్నర నుంచి రెండేళ్లలో చందాదారుల సంఖ్యను 10 లక్షలకు పెంచుకోవాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు యాట్రియా డైరెక్టర్ సి.ఎస్. సుందర్ రాజు చెప్పారు. ఏడాదికి రూ.800 కోట్ల టర్నోవర్ నమోదు చేసే దిశగా కంపెనీ అడుగులు వేస్తోంది.